కొడుకు చేతిలో తండ్రి హతం..

- అక్కాచెల్లెలుకు భూమి ఇచ్చినందుకు తనయుడి ఘాతుకం
- సిరిసన్నగూడెంలో ఘటన
- పోలీసుల అదుపులో నిందితుడు..!

వెంకటయ్య మృతదేహం

పాలకుర్తి రూరల్, డిసెంబర్ 17: అక్కా చెల్లెలుకు వ్యవసాయ భూమి పంచి ఇచ్చాడనే కోపంతో తండ్రిని హతమార్చిన తనయుడి ఉదంతం పాలకుర్తి మండలం సిరిసన్నగూడెంలో ఆదివారం జరిగింది. ఎస్సై తాళ్ల శ్రీకాంత్, గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. సిరిసన్నగూడేనికి చెందిన గాయాల వెంకటయ్య(68)కు నలుగురు కుమార్తెలు, కుమారుడు. వీరిలో కొంతకాలం క్రితం ఓ కుమార్తె మృతి చెందింది. వెంకటయ్యకు ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నెలరోజుల క్రితం తన కున్న వ్యవసాయ భూమిలో ఇద్దరు కూతుళ్లకు 20 గుంటల చొప్పున పంచాడు. ఈ విషయం నచ్చని తనయుడు గాయాల నర్సయ్య తండ్రిపై కోపం పెంచుకున్నాడు. ఆదివారం వారి వ్యవసాయ భూమి వద్ద గొడవపడి రాయితో దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా విచారణ చేపట్టారు. నిందితుడు నర్సయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. మృతదేహాన్ని జనగామలోని ఏరియా దవాఖానకు పోస్టుమార్టం కోసం తరలించారు. దీనిపై ఎస్సై తాళ్ల శ్రీకాంత్‌ను వివరణ కోరగా తండ్రిని కొడుకు చంపింది వాస్తవమేనని, మృతుడి కూతుళ్లు అందుబాటులో లేకపోవడంతో ఫిర్యాదు స్వీకరించలేదన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్యాయత్నం

రఘునాథపల్లి, డిసెంబర్ 17 : అప్పుల బాధతో పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం మండలంలోని కోమల్లలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోమల్ల గ్రామానికి చెందిన నీల యాదగిరి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయానికి పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు ఎక్కువ కావడంతో ఆవేదనకు గురైన యాదగిరి ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని చికిత్స కోసం జనగామలోని ఏరియా దవాఖానాకు తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ప్రైవేటు దవాఖానాకు తరలించారు.

రేపు హనుమకొండలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నయీంనగర్, డిసెంబర్17: హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో ఈనెల 19న హనుమకొండ, వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ అండర్-14,16 పోటీలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి తెలిపారు. 8 సంవత్సరాల క్రీడకారులకు 50, 300 మీటర్లు, స్టాండింగ్, లాంగ్‌జంప్, 10 సంవత్సరాల వారికి 100, 300 మీటర్ల లాంగ్‌జంప్, 12 సంవత్సరాల వారికి100, 400, 600 లాంగ్ జంప్, అండర్14 సంవత్సరాల వారికి 60మీటర్ల లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌బ్యాక్ త్రో, 600 మీటర్లు కిడ్ జావెలిన్, అండర్-16సంవత్సరాల వారికి 60, 600 హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈవెంట్లు ఉదయం 9.30గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు స్కూల్ హెచ్‌ఎం నుంచి లెటర్ తీసుకురావాలని సూచించారు. ఇందులో ఎంపికైన వారు జనవరి7న ఖమ్మంలో జరిగే జూనియన్ స్టేట్ మీట్‌లో పాల్గొంటారని, అండర్14, 16వారు ఫిబ్రవరి మూడో వారంలో గుజరాత్‌లో జరిగే నేషనల్‌లో పాల్గొంటారని స్పష్టం చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Wanted Male Councillor for our overseas consultancy (Experience Candidate will be preferred with attractive Salary). Cont: 8106349938, 9849248509.
NTW-321598

★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పిషంట్ల సేవకు ఇంటి/వంటమని, బేబీకేర్ కొరకు M/F వర్కు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

అయ్యప్ప దర్శనానికి వెళ్లొస్తూ..

- రోడ్డుపై సైడ్‌వాల్‌ను ఢీకొన్న కారు
- ముగ్గురు అయ్యప్ప భక్తుల దుర్మరణం, ఇద్దరికి తీవ్రగాయాలు
- తమిళ నాడు రాష్ట్రంలోని దేవనపట్టి వద్ద ఘటన
- కమలాపురంలో అలుముకున్న విషాదం

సుబ్బయ్యనాయుడు(ఫైల్)

సాంబయ్య(ఫైల్)

వెంకటరాజు(ఫైల్)

మంగపేట, డిసెంబర్ 17 : నలభై ఒక్క రోజు పాటు దీక్ష చేసి, శబరిమలై అయ్యప్ప స్వామి దర్శనం చేసుకొని సంతోషంగా ఇంటికి తిరిగి వస్తున్న అయ్యప్ప భక్తులు మార్గ మధ్యలోనే అనంత లోకాలకు వెళ్లారు. స్వాములు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న వాల్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన తమిళనాడు రాష్ట్రంలోని తెని జిల్లా పెరియాకుళం మండలం దేవనపట్టి బైపాస్ రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. మృతుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు తలారి సుబ్బయ్యనాయుడు(49), నర్రా సాంబశివరావు (51), నిమ్మల వెంకట రాజు(60), జరుపుల రాము, కూనూరు అజయ్ మాల ధరించి 41 రోజుల పాటు దీక్ష పూర్తి చేసుకున్నారు. ఈ నెల 14న గ్రామ పొలిమేరలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఇరుముడులు కట్టుకొని అదే రోజు ఏటూరునాగారానికి చెందిన ఓ అద్దె కారులో శబరిమలై బయలు దేరారు. కాగా, అయ్యప్ప స్వామి దర్శనం పూర్తి చేసుకొని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం తమిళనాడు రాష్ట్రంలోని తెని జిల్లా పెరియాకుళం మండలం దేవనపట్టి బైపాస్ రోడ్డు మీదుగా వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న వాల్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సుబ్బయ్యనాయుడు, సాంబశివరావు, వెంకటరాజు తల, ముఖం భాగాల్లో తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న మరో ఇద్దరిలో కూనూరు అజయ్‌కి ఎడమ చెయ్యి విరగగా, జరుపుల రాముకు గాయాలయ్యాయి. గాయపడ్డ ఇద్దరిని స్థానికుల సహకారంతో స్థానిక దవాఖానలో చేర్పించారు. కాగా, ఒకే గ్రామానికి చెందిన సౌమ్యులుగా పేరున్న ముగ్గురు కారు ప్రమాదంలో మృత్యువాత పడడంతో స్థానికంగా తీవ్ర విషాదం అలుముకున్నది. మండలానికి చెందిన అయ్యప్ప స్వా ములు ఇలా ప్రమాదానికి గురి కావడం ఇదే మొదటి సారి. వీరి కుటుంబాలు తీవ్ర విషాదంలో ఉండగా, ఇక్కడి నుం చి కారులో వెళ్లిన అయ్యప్ప స్వాములే పంచనామా ప్రక్రియ పూర్తి చేయించి, మృతదేహాలను తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, ప్రమాద సంఘటన దావనంలా వ్యాపించడంతో మండలంలో విషాదం నెలకొంది.

పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాలు

అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో జరిగిన కారు ప్రమాదంలో మూడు కుటుంబాలు తమ ఇంటి పెద్ద దిక్కును కోల్పోయాయి. 17 ఏళ్లుగా అయ్యప్ప మాల ధరిస్తున్న సుబ్బయ్యనాయుడుకి భార్య పార్వతి, ఇద్దరు కుమార్తెలు హర్షిణి, సార్తిక ఉన్నారు. వీరు బీటెక్ చదువుతున్నారు. అలాగే, ఐదేళ్లుగా అయ్యప్ప మాల ధరిస్తున్న సాంబశివరావుకు భార్య శివకుమారి, ఇద్దరు కొడుకులు మనీష్, నితీశ్ ఉన్నారు. వీరు చదువుకుంటున్నారు. కాగా, వెంకటరాజు మాల ధరించడం మొదటి సారి కాగా, ఆయనకు భార్య కాత్యాయిని, ముగ్గురు కూతుళ్లున్నారు. వీరికి వివాహాలు కూడా అయ్యాయి. కొడుకు దుర్గాప్రసాద్ లండన్‌లో చదువుకుంటున్నాడు. కాగా, అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లి సుదూర రాష్ట్రంలో రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో బాధిత కుటుంబాల రోధనలు పలువురికి కలచివేశాయి.

ఉర్సు ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే కడియం

ఉర్సు ఉత్సవాల్లో మత పెద్దలతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 17 : మండలంలోని కొత్తపల్లిలో జరుగుతున్న ఉర్సు ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఉర్సు ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. సోమవారం దీపారాధనతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం మత పెద్దలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. ఆయన వెంట ఏసీపీ శ్రీనివాస్ రావు, ఎస్సై నాగరాజు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటస్వామి, పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పోగుల సారంగపాణి, తోట వెంకన్న, యాకుబ్‌పాషా, మిర్జా షౌకతుల్లా బేగ్, అబ్జల్ బేగ్, రహిముల్లా బేగ్, సత్తార్ పాల్గొన్నారు.

రేడియో జర్నలిస్టులకు అండగా ఉంటా..

ఏడీ లక్ష్మణ్ కుమార్

నయీంనగర్, డిసెంబర్17: రేడియో జర్నలిస్టులకు అండగా ఉంటానని హనుమకొండ జిల్లా ఏడీ లక్ష్మణ్ కుమార్ అన్నారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో వరంగల్ రేడియో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు చిరంజీవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. రేడియో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయనతో పాటు వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి సదయ్యను సన్మానించారు. ఈ సమావేశంలో హర్షం సదానందం, జనార్దన్, సయ్యద్ మగ్దుం, ఎల్లయ్య, నాగేశ్వరరావు, కుమార్, చారి, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, సంధ్యారాణి, వాణి, భాగ్యలక్ష్మి, స్వాతి, మాలతి, మమత, సుమలత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వినియోగదారుల హక్కుల వారోత్సవాలు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దామోదర్

నయీంనగర్, డిసెంబర్ 17: దక్షిణ భారత దేశంలో జాతీయ వినియోగదారుల హక్కుల వారోత్సవాలను వినియోగదారుల సంఘాలు, క్లబ్‌లు విజయవంతం చేయాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమస్యల సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్ పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్‌లో జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఆదివారం ఏర్పాటు చేసిన చైతన్య కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ నెల 18 నుంచి 24 వరకు జరుగుతున్న వినియోగదారుల వారోత్సవాలను దక్షిణాది రాష్ట్రాల్లో కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. వివిధ స్థాయిలో వినియోగదారుల హక్కులు, రక్షణ, వినియోగదారుల బాధ్యతలపై కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో విద్యార్థుకు ఈ-కామర్స్ డిజిటల్ వర్తకంలో వినియోగదారుల రక్షణ అంశంపై వ్యాసరచన, డిబేట్ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సీహెచ్ హైమావతి, శ్రీదేవి, మల్యాల మనోహర్‌రావు, హరిత, జ్యోత్స్న, కవిరాజ్, సతీశ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

సుబేదారి, డిసెంబర్17: గ్రేటర్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికుడు మృతి చెందిన ఘటన సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌పర్తి అంబేద్కర్‌నగర్‌కు చెందిన జన్ను మొగిలి(58) శనివారం డ్యూటీకి వెళ్లాడు. తర్వాత సహచర కార్మికులతో కలిసి పెళ్లికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం ఇందిర నగర్ రోడ్డు కిందపడి చనిపోయి కనిపించాడు. అతడి మృతికి గల కారణం తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెట్టును ఢీకొన్న భక్తుల కారు

- ఐదుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- మేడారం వెళ్లి వస్తుండగా ఘటన

తాడ్వాయి, డిసెంబర్ 17 : మేడారంలోని సమ్మక్క, సారలమ్మ వనదేవతల దర్శనానికి వచ్చి తిరుగు ప్రయాణంలో వెళ్తున్న భక్తుల కారు చెట్టుకు ఢీకొన్న ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని వెంగళాపురం వద్ద ఆదివారం రాత్రి జరిగింది. వివరాలోకి వెళ్తే.. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు స్నేహితులు ఆదివారం మేడారంలోని వనదేవతల దర్శనానికి వచ్చారు. అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం తిరుగు ప్రయాణంలో వెంగళాపురం సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొంది. ఈ ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి తలకు తీవ్రగాయం కావడంతో అతడి పరిస్థితి విషమంగా మారింది. గమనించిన స్థానికులు క్షత గాత్రులను అంబులెన్స్ ద్వారా ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు.